పైకర్చులుకి ఓ వెయ్యి రూపాయలు తీసుకో. ఇక హోటలు అనే మాట మర్చిపోయి వ్యవసాయం చేసుకో... ఇదే నాకు న్యాయంగా తోచింది. ఇంతవరకు ఒచ్చిన లాభం నీ పొలానికి సరిపోతుంది. రెండుమూడురోజుల్లో వెయ్యియిచ్చేస్తా. ఇంకా ఏమన్నా పెద్ద ఎత్తుఎత్తతలచుకుంటే హోటలు నీదనేందుకు పిసరంత ఆధారం లేదు" అని నారాయణ బైటకు వెళ్ళిపోయాడు.

* * *

ఇంకటితోనైనా నాశనంకాకుండా తిరిగొచ్చినందుకు బంధువులూ- మిత్రులూ గ్రామం గ్రామమంతా అభినందించారు గోపాలాన్ని. "అదృష్టవంతుడే" అన్నారు. "చిత్రం" అన్నారు.

గోపాలం నెత్తిన చెయ్యిపెట్టి హోటలు కట్టుకున్న నారాయణ ఇప్పుడు "హోటల్ ప్రొప్రయిటర్సు అసోసియేషన్" అధ్యక్షుడు, మునిసిపల్ కౌన్సిలర్.

దుర్మార్గం, మోసం చేసిన పాపాత్ముల నాశనం అయినట్టూ, అవుతున్నట్టు మన పురాణాలూ, గ్రంథాలూ, ఆధునిక రచనలూ కూడా చాటుతున్నాయి. కాని నారాయణమాత్రం యింతవరకూ ఏం కాలేదు. సరే చూద్దాం కొంతకాలం. రాజకీయవేత్తా, ప్రజామంత్రీ అవుతాడేమో ముందు ఎన్నికల్లో!

స్కెచ్

# క్షణికమైన విలువలు

"శాంతిశ్రీ"

సంధ్యచీకట్లు నలుప్రక్కలా క్రమ్ముకుంటున్నాయి. రవి పడుకున్న గదిలోనికికూడ వీరవిహారానికొచ్చాయి. కాని ఇంతట్లోకి రవి తల్లి లాంతరు వెలిగించి బల్లమీదపెట్టి వెళ్ళిపోయింది. రవి అప్పుడే నిద్రనుంచి మేల్కొని ప్రక్కకు ఒత్తిగిలబోయాడు. ప్రక్కటెముకలు కళుక్కుమన్నాయి. ఆ బాధతోపాటు జరిగిపోయిన సంఘటనలన్నీ స్మృతిపథంలో మెదలసాగేయి. తనీ పరిస్థితులలో వుండటానికి కారణం ఏమిటి? క్రిందటి మేడు ఈరోజుల్లో నిక్షేపంలాగున్నాడే! జ్వరం చాలారోజులనుండి తీయకుండా కాస్తోంది. డాక్టర్లకు చూపిస్తే ఆ మందుకాదని ఈమందు ఇదికాదని అది ఇచ్చి జ్వరం తగ్గుముఖం పట్టకపోయేసరికి మనోవ్యాధని తేల్చేశారు. అయితే ఈ మనోవ్యాధి ఎందుకు వచ్చినట్లు? క్రిందటిసంవత్సరం ఈ రోజుల్లో నిక్షేపంలాగున్నాడే! సరిగా క్రిందటిసంవత్సరం ఈరోజుల్లోనే బి. ఏ. పరీక్షకెళ్ళాడు. పరీక్షాఫలితాలు తెలియగానే సుముహూర్తం నిశ్చయిద్దామనుకున్నారు పెద్దలు. తను శశిని ప్రేమించాడు. శశికూడా తనని గాఢంగా ప్రేమించింది. తను చెల్లెలి కుమారుడైనా బీదరికంలో వుండటంవల్ల మామయ్య యిష్టపడకపోతే చివరికి వుపవాసాలుకూడా చేసి తండ్రిని ఒప్పించింది శశి. తను బి. ఏ.లో జాయిన్ అయిన సంవత్సరమే శశి యింటర్‌లో చేరింది. రోజూ యిద్దరూకలిసే శశివాళ్ళ కార్లో కాలేజీకి వెళ్ళిరావడం జరిగేది. శశి తనని ఇంటి పద్ద దిగవిడిచి వెళ్ళేది. వాళ్ళ స్నేహం రెండేళ్ళల్లో ఎప్పటికీ విడిపడనంత చిక్కగా అల్లుకుపోయింది. మిగతా లతలేరోజున నీరుపోయకపోతే ఆరోజే ఎండుముఖంపడతాయి. కాని అనురాగలతకు చిగర్చటం మాత్రమే తెలుసు. గాలి వీచినపుడల్లా అమరసందేశాలు వినిపించేది. పబ్లికు పరీక్షలు దగ్గిరకొచ్చాయి. తనకెప్పుడూ పరీక్షలంటే భయంవుండేదికాదు. ఏ యితర గొడవలూ లేక దీక్షగా చదివి నిక్షేపంగా ఉత్తీర్ణుడవుతుండేవాడు. అదృష్టానికికూడ తనంటే అమితప్రేమ. అంత ప్రేమించేవాళ్ళుకూడా హఠాత్తుగా ఎందుకుమారిపోతారో అర్థంకాలేదు తనకి.

ఇంతలోకి రవితల్లి ఓవల్టిన్ తీసుకురావడంచేత రవి భావపరంపరలకు అంతరాయం కల్గింది. ఒంట్లో చాలా నీరసంగావుంది. కళ్ళు మూసుకున్నాడు. కాని నిద్రరాదు.

తిరిగి ఆలోచనలలో మునిగిపోయాడు. ఆ

రోజే పరీక్షాఫలితాలు తెలిశాయి. మిన్నువిరిగి మీదపడినట్లనిపించింది. తనక్రిందనున్న భూమాత కూడ ఆగ్రహించి గిరగిరా తిరుగుతున్నట్లనిపించింది. కళ్లు చీకట్లు క్రమ్మాయి. తను ఎలా తప్పాడు? బాగానే వ్రాశాడే పరీక్షపేపర్లు. తప్పాడనేసరికి ఏడుపువచ్చింది. తలగడలో తల దూర్చి వెక్కివెక్కి యేడవటం మొదలుపెట్టాడు. తనలా ఏడుస్తూంటే నాన్న "తప్పింది కాకుండా సిగ్గులేక వెధవకి ఏడుపుకూడా" అన్నారు. తనెప్పుడూ ఏడ్చిఎరగడు. కాని ఎంతప్రయత్నించినా ఆ సమయంలో ఏడవకుండా వుండలేకపోయాడు. నాన్న అలా అనగానే అన్నయ్యన్నాడు "తప్పటం, పాసవటం మనచేతులలోలేవు నాన్నగారూ. రవిసెందురలా కోప్పడతారు? అయినా జరగబోయేదేదో జరగక తప్పనప్పుడు ఎవరిని ఏమని ప్రయోజనం" అన్నాడు. అది వింటూంటే "అబ్బా! అన్నయ్య ఎంతమంచివాడు! ఎంతబాగాచెప్పాడు!" అనిపించింది తనకి. అన్నయ్యంత మంచివాడు కాబట్టి మొదటినుండీ అన్నయ్యమీద తనకి అంతులేని భక్తి గౌరవాలేర్పడ్డాయి అన్నయ్యంటే తనకి దైవసమానం. అన్నయ్య మాటగానే "నిజమే" అనుకున్నారో మరేమనుకున్నారోగాని నాన్నగారు మరెప్పుడూ తన పరీక్ష విషయమెత్తలేదు. అమ్మమాత్రం పల్లెత్తు మాటనలేదు. తనేడుస్తూంటే తనని ఓదార్చి అంతకూ వూరుకోకపోతే తను కూడా కళ్ల నీళ్లు పెట్టుకొనేదా మాతృమూర్తి. అదే మాతృహృదయం. తనలా గుండెలు బ్రద్దలయ్యేటట్లు పరితపిస్తోంటే ప్రక్కగదిలోంచి మామయ్య మాటలు వినిపించాయి: "ఇలాంటి దౌర్భాగ్యుడని తెలియకపోయింది. ఏదో బుద్ధిమంతుడుకదా పిల్ల యిష్టానుసారంగానే చేద్దామనిపించింది. ఇహ ఆ వెధవకి పిల్లనెవరిస్తారు?" అంటున్నాడు. తనకంత విచారంలో కూడా పౌరుషం బుసలుకొట్టింది. తను గబగబా గదిలోంచి రెండంగుల్లో బయటకు వచ్చాడు. కాని మామయ్యుంటేగా అక్కడ! తనారోజల్లా భోజనం చేయలేదు. మరునాడు విజయంసాధించిన తన క్లాసుమేట్సంతా వచ్చారు పరామర్శించటానికి. ఇదివరకు తనను పొగుడుతూ తనవెంటే తిరిగే వాళ్ళకూడా అలుసయిపోయాడు. వెంకట్రావుపుట్టుక వెంకట్రావేమన్నాడు! "మనవాడు ఇప్పుడుకాకపోతే సెప్టెంబరులోనైనా ఫస్టుమార్కులు కొడ్తాడురా" అన్నాడు. ఇదంతా తనని ఎగతాళిచేయటానికేగా! తను స్నేహితులనుకున్నవారి అసలు రూపు యిప్పుడు బయటపడుతోంది. వెంకట్రావెన్నిసార్లు తనచేత సహాయాలు పొందలేదు; తన తల తిరిగిపోతోంది. అంతా కృతఘ్నులుగా కనుపిస్తున్నారు. తను తప్పితే వీళ్ళకెందుకీబాధ. తననేడిపించటంవలన వీళ్ళకేం లాభిస్తుంది? తననేం వీళ్ళు పోషించి చదువుచెప్పటంలేదే! తన భారం వీళ్లు మోయనప్పుడు వీళ్ళకెందుకింత దుగ్ధ? ఏమిటో అంతా మాయగా కనుపిస్తుంది. శశి తొంగిచూడకపోవడం తన కన్నిటికంటే అమితబాధకలిగించింది. ఇలా రెండునెలలు గడిచాయి. శశి అంతూపొంతూలేదు. తనకా బయటికి వెళ్ళాలంటే చాలా బాధగావుంది. ఉన్నట్లుండి ఒకరోజున పిడుగువంటి వార్త చెవిని పడింది, శశి పెండ్లి యొక ధనవంతుని బిడ్డతో అవుతున్నట్లు తెలిసింది. ఈ వార్త వినగానే తన మనస్సు చెదిరింది. "ఎంత మోసంచేసింది? ఆమె చూపిన అనురాగం ప్రేమ అంతా మిథ్యయేనా? ఛీ! ఆడివాళ్ళంతా ఇంతే కాబోలు. నమ్మించి గొంతు కోస్తారు" అని ఆ సమయంలో తన కనిపించిన మాట మాత్రం వాస్తవమే. ఆ మాటే అన్నయ్య దగ్గరంటే అన్నయ్యేమన్నాడు? "పరిస్థితుల నర్థంచేసుకోకుండా అనవసరంగా నిందవేయకు రవీ! మామయ్య మూర్ఖపు పట్టుబట్టి బలవంతంగా యీ పెళ్ళి కొప్పించివుంటాడు శశిని. ఆమెమాత్రం యేమి చేయగలుగుతుంది? కాలేజీలో చదివినంత మాత్రాన అబల సబలవుతుందా? ఒక్క విషయం తీసుకొని ఆడవాళ్ళనందరినీ దూషించడమంత పొరపాటు మరియొకటి లేదు" అన్నాడు. అంతే, శశి పెండ్లి ఎవరితోనో అయిపోయింది. తను తన గది వదిలివెళ్ళటం పూర్తిగా మానివేశాడు. రానురాను చాలా నీరసించిపోయాడు కాని మొదట్లో అంత లెక్క చేయలేదు. తర్వాత కొద్దిరోజులకు జ్వరంకూడా తగలడం మొదలుపెట్టి అది తననీ పరిస్థితులలోకి లాక్కొచ్చింది. ఇంతకీ పరీక్ష తప్పినవాళ్ళమీద ఎందుకింతకక్ష? ★